క్లుప్తంగా

కంటి ఆపరేషన్లకు 17మంది ఎంపిక



కంటి వైద్య పరీక్షలు చేస్తున్న పీఈఎస్ వైద్యులు

గంగవరం: మండలంలోని లయన్స్ క్లబ్‌లో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని పలమనేరులోని చైల్డ్‌హుడ్ ఫ్రెండ్స్ సహకారంతో నిర్వహించారు. కుప్పం పీఈఎస్ ఆసుపత్రి వైద్యులు ఈ శిబిరంలో 111 మందికి వైద్య పరీక్షలు చేశారు. 17మందిని కంటి ఆపరేషన్ల కోసం ఎంపిక చేసినట్టు క్లబ్ ప్రెసిడెంట్ రఘు తెలిపారు.

ట్రాక్టర్ల బ్యాటరీలు చోరీ

చౌడేపల్లె: మండలంలోని ఆమినిగుంట పంచాయతీ సింగిరిగుంటలో ట్రాక్టర్ల బ్యాటరీలు చోరీకి గురయ్యాయి. ఆదివారం ఇది వెలుగులోకి వచ్చింది. తొమ్మిది మంది రైతుల ట్రాక్టర్లు వేర్వేరు ప్రాంతాల్లో తమ ఇళ్ల వద్ద నిలిపారు. శనివారం రాత్రి దొంగలు వీటి బ్యాటరీలను చోరీ చేశారు. వీటి విలువ సుమారు రూ.1.30 లక్షలని బాధిత రైతులు చెప్పారు. ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

వలంటీర్ హఠాన్మరణం



గంగాధరం(ఫైల్)

సోమల: మండలంలోని తమ్మినాయనిపల్లె పంచాయతీ స్థానిక దళితవాడకు చెందిన వలంటీర్ గంగాధరం కుప్పకూలి మరణించాడు. శనివారం ఉదయం ఉన్నపళాన పడిపోవడంతో గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన తిరుపతి స్విమ్స్ ఆసుపత్రికి తరలించారు.అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు. గుండెపోటుకు గురై మృతి చెందిన ఉండవచ్చని భావిస్తున్నారు. ఇతని మృతికి ఎంపీడీఓ నాగరాజ, వైస్ ఎంపీపీ సయ్యద్ బాషా, సర్పంచ్ సురేంద్ర రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు నాగభూషణం, రమణ సంతాపం వ్యక్తం చేశారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందజేస్తున్న ఎంపీపీ సుబ్రమణ్యం

రామకుప్పం: మండలంలోని కొంగనపల్లెకు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త తిప్పన్న(80) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. ఇది తెలుసుకున్న చిత్తూరు ఎమ్మెల్సీ భరత్ ఎంపీపీ సుబ్రమణ్యం, పార్టీ నేతల ద్వారా రూ.10వేలను మృతుడి కుటుంబానికి అందజేశారు. పార్టీ నాయకులు నివాళులు అర్పించారు. పార్టీ మండల కో–కన్వీనర్ చంద్రారెడ్డి, స్థానిక సర్పంచ్ కళమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు సౌందర్య, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు సుగుణప్ప, ఇంద్రప్ప, ప్రభాకర్‌రెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

వినియోగదారుల సౌకర్యం కోసమే టవర్ల ఏర్పాటు

- బీఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ అమరేందర్‌రెడ్డి



తూగుండ్రంలో అధికారులతో మాట్లాడుతున్న జీఎం

గంగాధర నెల్లూరు: వినియోగదారుల సౌకర్యం కోసమే మారుమూల ప్రాంతాల్లో బీఎస్ఎన్ఎల్ కొత్త టవర్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఆ సంస్థ జనరల్ మేనేజర్ అమరేందర్ రెడ్డి తెలిపారు. మండలంలోని పాచిగుంట వద్ద కొత్తగా ఏర్పాటు చేస్తున్న టవర్ పనులను ఆదివారం పరిశీలించారు. అనంతరం తూగుండ్రం గ్రామం సమీపంలో టవర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి చొరవ, స్థానికుల నుంచి వచ్చిన విజ్ఞప్తులతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామీణ ప్రాంతాల్లో కొత్తగా టవర్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టామన్నారు. అదే విధంగా ఫైబర్ నెట్ కనెక్షన్ ద్వారా రూ.399, రూ.499, రూ.599 కనెక్షన్‌లు పొందితే ఇంటర్నెట్, కాల్ సౌకర్యం లభిస్తుందని తెలిపారు. డివిజినల్ ఇంజినీర్ సురేంద్ర నాథ్, సబ్ ఇంజినీర్ శ్రీనివాసులు, జేటీఓ సిద్దయ్య, జేఈ నర్సింహా రెడ్డి, జీవా రత్నం పాల్గొన్నారు.

ఈరోజు

ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశం

పుంగనూరు: పుంగనూరు ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశం సోమవారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సీతారామన్ ఆదివారం తెలిపారు. ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్న సమావేశంలో కమిటీ సభ్యులు, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని ఎస్సీ, ఎస్టీ సమస్యలపై చర్చించి, పరిష్కరించాలని కోరారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- 108మంది రైతులకు రూ.23లక్షల విలువైన వ్యవసాయ పనిముట్లు



రైతులకు వ్యవసాయ పనిముట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ భాస్కర్‌రెడ్డి, రామమోహన్‌రెడ్డి

పుంగనూరు: రైతు సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తోందని ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మంగళం గ్రామంలో వాటర్‌షెడ్ పీఓ ధనుంజయమూర్తి , చైర్మన్ రాజారెడ్డి ఆధ్వర్యంలో రైతులకు వ్యవసాయ పరికరాలు పంపిణీ చేసి ఎంపీపీ మాట్లాడారు. మంగళం పంచాయతీలో 108 మంది రైతులకు రూ.23 లక్షలు విలువ చేసే వ్యవసాయ పనిముట్లు మంజూరయ్యాయని, వాటిని లబ్ధిదారులకు అందజేసినట్టు చెప్పారు. వీటిని సద్వినియోగం చేసుకుని వ్యవసాయంలో మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. ఎస్సీ, ఎస్టీలకు 90 శాతం, ఇతరులకు 80 శాతం రాయితీపై ఆయిల్ ఇంజిన్లు, స్ప్రేయర్లు, పీవీసీ పైపులు, టార్పాలిన్ పట్టలు పంపిణీ చేశామన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి విత్తనాలు, ఎరువులు, మందులు ఎంఆర్‌పీకే అందేలా చర్యలు తీసుకుని వ్యవసాయ రంగానికి జవసత్వాలు ఇస్తోందన్నారు. అలాగే రైతులకు పంటల సాగులో అవసరమైన సలహాలు–సూచనలు ఇవ్వడంతో పాటు గిట్టుబాటు ధర లభించేలా చేస్తోందన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని రెండవసారి ముఖ్యమంత్రిగా గెలిపించేందుకు కృషి చేయాలని కోరారు. సమావేశంలో ఏఈఓ సుబ్రమణ్యం, వైఎస్సార్‌సీపీ నాయకులు రామమోహన్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్లు, రైతులు పాల్గొన్నారు.

వెక్కాళీయమ్మన్ వార్షిక పూజ



అమ్మవారి సేవలో ఇందుమతి తదితరులు

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలం తమ్మిందలోని శ్రీ వెక్కాళీయమ్మన్ ఆలయంలో వార్షిక మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఆలయంలో విశేష పూజలు, పాలాభిషేకం చేశారు. గ్రామస్తులు ఊరేగింపుగా వచ్చి, ఆలయ ఆవరణలో పొంగళ్లు పెట్టి, అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఈ మహోత్సవానికి ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి సతీమణికి ఇందుమతి హాజరయ్యారు. ఆమెకు ఆలయ నిర్వాహకులు ఘనస్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రంజని, నాయకులు కుమార్, మధురెడ్డి, మణిబాబు, రాజేంద్ర, వెంకటేశులు, తులసి గ్రామస్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి గడప గడపకు..

వి.కోట: మండలంలో సోమ, మంగళవారాల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే వెంకటేగౌడ నిర్వహించనున్నారని ఎంపీపీ యువరాజు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. జవునపల్లె గ్రామ సచివాలయ పరిధిలో ఉదయం 7 గంటల నుంచి నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో మండల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని ఆయన కోరారు.

నేటి నుంచి న్యాయవాదులు విధుల బహిష్కరణ

పుంగనూరు: పట్టణంలోని మూడు కోర్టుల విధులను సోమవారం నుంచి బహిష్కరిస్తున్నట్లు సంఘ అధ్యక్షుడు గల్లా శివశంకర్‌నాయుడు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ, వెల్ఫేర్ స్టాంపుల విషయంలో బార్ కౌన్సిల్ న్యాయం చేయనందుకు నిరసనగా నవంబర్ 11వ తేదీ వరకు విధులను బహిష్కరిస్తున్నట్లు తెలిపారు. న్యాయవాదులు పాల్గొని న్యాయపోరాటం చేయాలని కోరారు.

ఆర్టీసీ కార్మికుల ఆందోళన



పుత్తూరు రూరల్: నెల్లూరు జిల్లా కావలి వద్ద ఆర్టీసీ బస్సు డ్రైవర్ రామ్‌సింగ్‌పై దాడిని నిరసిస్తూ పుత్తూరు ఆర్టీసీ డిపో వద్ద వైఎస్సార్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు ఆదివారం నిరసన వ్యక్తం చేశారు.. నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. యూనియన్ నాయకులు మాట్లాడుతూ.. దాడికి పాల్పడిన వారిలో కొంత మందినే అరెస్ట్ చేశారని, మిగిలిన వారిని సైతం అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

కమనీయం ఆదిదంపతుల కల్యాణం

- ప్రత్యేక పూజలు చేసిన భక్తులు
- నేడు సూర్య, చంద్రప్రభ వాహనాలపై ఊరేగనున్న స్వామివారు



స్వామి, అమ్మవారికి నిర్వహిస్తున్న కల్యాణోత్సవం

చంద్రగిరి: స్వర్ణముఖీనది ఒడ్డున వెలసిన శ్రీఅగస్తీశ్వరస్వామి(ముక్కోటి)వారి ఆలయంలో ఆదివారం రాత్రి పార్వతీ పరమేశ్వరులకు వైభవంగా కల్యాణోత్సవాన్ని ఆలయ అర్చకులు నిర్వహించారు. రుద్రపాదాల ముక్కోటి ఉత్సవాల్లో భాగంగా ఉదయం స్వామి, అమ్మవార్లను సుప్రభాత సేవతో మేల్కొలిపారు. అనంతరం మూలమూర్తికి రుద్రాభిషేకం నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించారు. తదుపరి శ్రీరామచంద్రమూర్తి, శ్రీవేణుగోపాల స్వామివారికి అభిషేక సేవను నిర్వహించి, అలంకరణ చేశారు. అనంతరం సాయంత్రం దీపారాధన, కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలను నిర్వహించారు. తదుపరి రాత్రి స్వామివారికి ఉయ్యాలసేవ నిర్వహించి, ప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మొగిలి రఘురామిరెడ్డి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సవాల్లో నేటి కార్యక్రమాలు

రుద్రపాదాల ముక్కోటి ఉత్సవాల్లో భాగంగా సోమవారం ఉదయం స్వామి వారు సూర్యప్రభ వాహనంపై విహరించనున్నారు. తదుపరి కాలభైరవ స్వామి, శ్రీమహాలక్ష్మీ దేవిలకు అభిషేకం, రాత్రి చంద్రప్రభ వాహనంపై ఉత్సవర్లు ఊరేగనున్నారు.

ప్రవచనం కాదు.. ప్రజావచనం కావాలి





సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం, వేమన పద్యభావనకు నృత్య ప్రదర్శన చేస్తున్న తిరుపతి బాలభవన్ విద్యార్థులు

- వేమన విజ్ఞాన కేంద్రం ప్రారంభసభలో వక్తల పిలుపు

తిరుపతి కల్చరల్: ప్రవచనాలు చెప్పే వారు చాలా మంది ఉన్నారు... అయితే నేటి సమాజానికి ప్రజావచనం చెప్పేవారు కావాలని పలువురు వక్తలు ఉద్ఘాటించారు. యశోదనగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన వేమన విజ్ఞాన కేంద్ర భవనాన్ని ఆదివారం ప్రముఖ పాత్రికేయుడు, రాజకీయ విశ్లేషకుడు తెలకపల్లి రవి ప్రారంభించారు. చిత్తూరు జిల్లా కమ్యూనిస్టు నేత పలవలి రామకృష్ణారెడ్డి పేరిట ఏర్పాటు చసిన సభా మందిరాన్ని ఆయన కుమార్తె , మాజీ వీసీ ఆచార్య కుసుమ కుమారి, ప్రముఖ అనువాదకుడు ఏజీ యతిరాజులు పేరిట నిర్మించిన సభా మందిరాన్ని ఆయన సతీమణి ఏజీ చంద్రమ్మ ప్రారంభించారు. దీనికి ముందు టీటీడీ పరిపాలనా భవనం నుంచి పెద్ద ఎత్తున వందలాది మంది విద్యార్థులు, సాహితీవేత్తలతో వేమన విజ్ఞాన కేంద్ర కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథి తెలకపల్లి రవి మాట్లాడుతూ సమాజానికి హేతుబద్ధ ప్రశ్నను నేర్పించిన కవి వేమన అని కొనియాడారు. మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ కళలకు, కళాసాహిత్యానికి కేంద్రంగా ఈ సంస్థ పరిఢవిల్లాలని ఆకాంక్షించారు. వేమన తిరుపతి బాలభవన్ విద్యార్థులు ప్రదర్శించిన నృత్యరూపకం అలరింపజేసింది. మాజీ వీసీ కుసుమకుమారి, ఏజీ అరవింద్, సీనియర్ నటుడు కాకరాల, రాయలసీమ సాహితీవేత్త భూమన్, రీచ్ గ్లోబల్ ఫౌండేషన్ చైర్మన్ లింగుట్ల రమేష్‌నాథ్, తిరుపతి బాలోత్సవం గౌరవాధ్యక్షుడు టెంకాల దామోదరం, తిరుపతి జిల్లా ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఉపాధ్యక్షుడు కేవీ చౌదరి, రచయిత్రి కొలకలూరి మధుజ్యోతి, కేంద్ర సాహితీ అవార్డు గ్రహీత పల్లిపట్టు నాగరాజు, విజ్ఞాన కేంద్రాల కో ఆర్డినేటర్ పిన్నమనేని మురళీకృష్ణ, వేమన విజ్ఞాన కేంద్రం కార్యదర్శి మల్లారపు నాగార్జున పాల్గొన్నారు.



వేమన విజ్ఞాన కేంద్రాన్ని, ప్రారంభిస్తున్న అతిథులు, నిర్వాహకులు

వేరుశనగ కాయల ఒబ్బిడిలో రైతులు బిజీబిజీ



వేరుశనగ దిగుబడిని త్రాసులో తూకం వేసి దిగుబడిని నిర్ధారిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు



పొలాల్లో వేరుశనగ కాయలను వేరు చేస్తున్న రైతు కూలీలు

తవణంపల్లె: ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన వేరుశనగ పంట ఒబ్బిడిలో రైతులు బిజీ బిజీగా ఉన్నారు. మండలంలోని రైతులు 1,260 ఎకరాల్లో వేరుశనగ పంటను రెండు, మూడు దశల్లో సాగు చేశారు. అదునుకు వర్షాలు సక్రమంగా కురవకపోవడంతో పంట బాగా దెబ్బతింది. తర్వాత వర్షాలు కురిసినా ఆశించిన దిగుబడి రాలేదు. ప్రకృతి వైపరీత్యాలతో, అడవి జంతువుల దాడులతో పంటలను కాస్త దెబ్బతీశాయి. మండలంలో ముందస్తుగా సాగు చేసిన రైతులు పంటను ఒడుపుతున్నారు.

అడవి పందులు, కోతుల బెడద

మండలంలో సాగు చేసిన పంటలకు అడవి పందులు, కోతులు బెడద అధికంగా ఉంది. ఇవి తరచూ పంటలకు నష్టం కలిగిస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఎకరాకు వేరుశనగ దిగుబడి 12 బస్తాలు

ఖరీఫ్ సీజన్‌లో మండలంలో ఎకరాకు 9 నుంచి 14 బస్తాల వేరుశనగ దిగుబడి వస్తోంది. ఒక్కొక్క పొలంలో ఒకో రకంగా దిగుబడి వస్తోంది. పొలాల్లో వేరుశనగ దిగుబడిని పరిశీలించగా 3.5 కిలోల నుంచి 5.5 కిలోల వరకు వచ్చినట్లు తేలింది. మండలంలో ముందుగా సాగు చేసిన రైతులు పంటను ఒడుపుతున్నారు.

నూర్‌షావలి దర్గాపై కలేష్ ప్రతిష్ఠాపన



పుంగనూరులో దర్గా కలేష్‌తో ప్రదర్శన చేస్తున్న ముస్లింలు

పుంగనూరు: పట్టణంలోని చెరువు కట్ట వద్ద ఉన్న హజరత్ నూర్‌షావలి బాబా దర్గాపై గుమ్మస్ కలేష్(కలశం) ను ఆదివారం వైభవంగా ప్రతిష్ఠాపన చేశారు. దర్గా కమిటీ ముస్లిం పెద్దలు ఆర్టీసీ కరీముల్లా, యూసుఫ్, నౌషాద్, అస్లాం మురాది ఆధ్వర్యంలో కలేష్‌ను వాహనంపై ఉంచి పట్టణంలో ఊరేగించారు. ముస్లింలు డప్పుల మోత నడుమ మత ప్రార్థనలు చేసి అల్లాహో అక్బర్ అంటూ గుమ్మస్ కలేష్ ప్రతిష్ఠాపన వారి సంప్రదాయానుసారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పెద్ద సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు. సీఐ రాఘవరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

రాష్ట్ర స్థాయి టెన్నికాయిట్ పోటీలకు ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో ఫిజికల్ డైరెక్టర్ కరుణానిధి

సోమల: రాష్ట్ర స్థాయి అండర్–17, అండర్–14 టెన్నికాయిట్ పోటీలకు సోమల ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని హెచ్‌ఎం తుంగా నాగరాజ ఆదివారం తెలిపారు.ఉమ్మడి జిల్లా ఎంపికల్లో భాగంగా శనివారం ఎస్సార్ పురం మండలం చిల్లమాకులపల్లె ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సెలెక్షన్స్‌లో తమ స్కూలు పదవ తరగతి విద్యార్థి మహమ్మద్ అనస్, పఠాన్ రిహాన్ అండర్–17 జట్టుకు, 9వ తరగతి విద్యార్థి మహమ్మద్ అఫ్రోజ్, 8వ తరగతి విద్యార్థి సాయి మదన్ అండర్–14 విభాగంలో ప్రతిభ చాటి చిత్తూరు జిల్లా జట్టుకు ఎంపికయ్యారని, వీరు త్వరలో పశ్చిమ గోదావరి జిల్లాలో రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఫిజికల్ డైరెక్టర్ కరుణానిధి తెలిపారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి



బోయకొండలో వసతుల గురించి భక్తులతో మాట్లాడుతున్న చైర్మన్ నాగరాజారెడ్డి తదితరులు

చౌడేపల్లె: బోయకొండ గంగమ్మ ఆలయం వద్ద కోట్లాది రూపాయలతో చేస్తున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఆలయ కమిటీ చైర్మన్ నాగరాజారెడ్డి ఆదేశించారు. ఆదివారం ఈఓ చంద్రమౌళి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డితో కలిసి పనులను పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలతో పనులను పూర్తిచేయాలన్నారు. దర్శనం అనంతరం ప్రతి భక్తుడికి అమ్మవారి తీర్థప్రసాదాలతోపాటు కుంకుమ, నిమ్మకాయ లేదా అమ్మవారి పుష్పం ఇచ్చేలా ఏర్పాట్లు చేశామని ఈఓ తెలిపారు. తాగునీటి వసతితో పాటు మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. పాలక మండలి సభ్యుడు రాజేష్, పాల ఏకరి కార్పొరేషన్ డైరెక్టర్ లడ్డూ రమణ తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరు సాంస్కృతిక జీవనానికి ప్రతీక సభా కథలు



మా కథలు-2022 పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు, నిర్వాహకులు

తిరుపతి కల్చరల్: చిత్తూరు జిల్లా సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా రచయిత కె.సభా కథలు రచనా వ్యాసంగం చేశారని ప్రముఖ రచయిత మధురాంతకం నరేంద్ర అన్నారు. ఆదివారం సాయంత్రం బైరాగిపట్టెడలోని ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో తిరుపతి జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో కె.సభా సంస్మరణ సభ, మా కథలు–2022 కథ సంకలనాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మధురాంతకం నరేంద్ర, భూమన్, ఆత్మీయ అతిథులుగా పలమనేరు బాలాజి, కృష్ణస్వామి రాజు పాల్గొన్నారు. సాకం నాగరాజు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆకుల మల్లేశ్వరరావు, డాక్టర్ మన్నవ గంగాధర ప్రసాద్, తమటం రామచంద్రారెడ్డి, కలువగుంట రామమూర్తి, డాక్టర్ నెమిలేటి కిట్టన్న, యువశ్రీ మురళి, పల్లిపట్టు నాగరాజు, కాంతారావు, సురేంద్ర రొడ్డా పాల్గొన్నారు.

పాణ్యంకొండకు ప్రత్యేక ఆకర్షణ

- 54 అడుగుల ఎత్తుతో సుబ్రమణ్యస్వామి భారీ విగ్రహం
- 1న ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చేతుల మీదుగా విగ్రహావిష్కరణ
- ఆధ్యాత్మిక క్షేత్రంలో భక్తుల సంఖ్య పెరగడానికి దోహదం



నూతనంగా నిర్మించిన 54 అడుగుల సుబ్రమణ్యస్వామి విగ్రహం

పాకాల: మండల కేంద్రానికి సమీపంలోని పాళ్యం కొండపై ఉన్న శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రమణ్య స్వామి ఆలయ ఆవరణలో నూతనంగా నిర్మించిన 54 అడుగుల సుబ్రమణ్యస్వామి విగ్రహం ఇక్కడ ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. నవంబర్ 1న ఈ విగ్రహాన్ని చంద్రగిరి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ప్రారంభించనున్నారు. అలాగే విగ్రహావిష్కరణ, ఆలయంలో నిర్వహించే ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి పాల్గొంటారు. ఈ నేపథ్యంలో, ఆదివారం ఆలయ కమిటీ చైర్మన్ మహాసముద్రం పట్టాభిరెడ్డి మాట్లాడారు. విగ్రహావిష్కరణ కుంభాభిషేకం కార్యక్రమాన్ని 3 రోజులు నిర్వహించనున్నట్టు చెప్పారు. కుంభాభిషేకంలో భాగంగా సోమవారం ఉదయం 9 గంటలకు గణపతిపూజ, పుణ్యాహవచనం, సాయంత్రం వాస్తు హోమం, గంగపూజ, మృత్సంగ్రహణ, అంకురార్పణ, అఖండ స్థాపన, వరుణ ఆవాహన కలశస్థాపన, తీర్థప్రసాద వితరణ, మంగళవారం ఉదయం 8.30 గంటలకు వేదపారాయణ, ప్రాతఃకాలపూజ, ఆవాహిదేవతా హోమములు, సాయంత్రం వేదపారాయణ, దీక్షా హోమం, పునఃపూజా, తీర్థప్రసాద వితరణ, బుధవారం ఉదయం 7 గంటలకు వేదపారాయణ, ప్రాతఃకాల అర్చన, నాడీసంధాన బింబ కళాహోమాదులు, ఉదయం 9 గంటలకు మహాపూర్ణాహుతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు.

సర్వీస్ రూల్స్ రూపొందించండి



వినతి పత్రం సమర్పిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉద్యోగ సంఘ నేతలు

తిరుపతి కల్చరల్: ప్రభుత్వంలో విలీనమై రెండేళ్లు గడిచినా ఇంత వరకు తమకు సర్వీస్ నిబంధనలు రూపొందించలేదని, సర్వీస్ రూల్స్‌ను రూపొందించి ఆదుకోవాలని ప్రభుత్వ జూనియర్ కళాశాలల ఉద్యోగ సంఘం నేతలు ఆదివారం ఎమ్మెల్సీలు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, కల్పలతారెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ మేరకు ఎస్వీ యూనివర్సిటీలో వారిని కలిసి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల ఉద్యోగుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ నాదెండ్ల శ్రీమన్నారాయణ, డాక్టర్ జలగం రామాంజులు, ఉద్యోగ సంఘ నేతలు సురేంద్ర, సావిత్రీబాయి, శ్రీనివాసులు, డాక్టర్ సుప్రజారాణి, సంజీవరావు, భరణికుమార్, సోమనాథ్, ప్రతాప్ ఉన్నారు.